క్లుప్తంగా

ఏయూ విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



గోల్డ్ మెడల్ విజేత మెహరున్నీసాను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు క్రీడల్లో రాణించాలని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఏపీ సీఎం కప్ క్రీడా పోటీల్లో ఏయూ మెరైన్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థిని ఎం.డి.మెహరున్నీసా బేగం బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా సోమవారం వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో మెహరున్నీసాను సత్కరించి అభినందించారు. బాక్సింగ్ క్రీడలో 52–54 కేజీల విభాగంలో విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మెహరున్నీసా గోల్డ్ మెడల్ సాధించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య వి.వి.ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

20వ వార్డులో కార్పొరేటర్ పర్యటన



సమస్యలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముువ్వల లక్ష్మి

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు పెద వాల్తేరులో సోమవారం కార్పొరేటర్ ముువ్వల లక్ష్మి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పనుల ప్రగతిని పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మద్ది పోలిరెడ్డి, వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్‌పర్సన్ పండరీబాయి, ధర్మకర్త ప్రసాద్‌రెడ్డి, పోలమాంబ ఆలయం ధర్మకర్త రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో సమస్యలపై ఆరా



దుర్గానగర్‌లో శిథిలమైన రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో సమస్యలపై కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆరా తీశారు. వార్డులోని దుర్గానగర్‌లో సోమవారం సచివాలయ సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. రోడ్లు, కాలువలు, వీధిలైట్లను పరిశీలించారు. అక్కడ కాలువలు, రోడ్లు శిథిలం కావడం, వీధి దీపాలు వెలగకపోవడం, అపారిశుధ్యం తదితర సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. పలుచోట్ల కాలువల్లో చెత్త పేరుకుపోవడం, రోడ్లు దెబ్బతినడాన్ని ఆమె పరిశీలించి ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని నివాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు సుజాత, శ్రీను, నీటి సరఫరా విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ పాల్గొన్నారు.

నేడు సంకట హర చతుర్థి

సీతంపేట: సంకట హర చతుర్థి సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు గణపతి పంచావరణ అర్చన, గణపతి హోమం నిర్వహించనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. వైశాఖ అష్టమి సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు చండీ హోమం, సాయంత్రం 6.30 గంటలకు కాళీ కాలభైరవ హోమం జరుగుతాయన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

సమస్యల్లో తెన్నేటి పార్కు

- శిథిలమైన పాత్‌వేలు, మెట్ల మార్గాలు
- విరిగిన బెంచీలు.. కానరాని రెయిలింగ్
- ఇబ్బందులు పడుతున్న సందర్శకులు



పార్కులో శిథిలమైన మెట్లు



తెన్నేటి పార్కులో శిథిలమైన పాత్‌వే, పాడైన సిమెంట్ బెంచీలు

ఆరిలోవ: పర్యాటక కేంద్రం.. ఆహ్లాదకరమైన పార్కుగా పేరొందిన తెన్నేటి పార్కు శిథిలమవుతోంది. ఇక్కడికి నగరవాసులతోపాటు విదేశీ పర్యాటకులు సైతం వస్తుంటారు. నగరంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసగిరి కొండ దిగువున బీచ్ రోడ్డును ఆనుకొని ఈ పార్కు ఉంది. దీంతో కైలాసగిరికి వెళ్లే సందర్శకులు ఎక్కువ మంది దీన్ని కూడా సందర్శిస్తుంటారు. కై లాసగిరి కొండ పైనుంచి వచ్చిన సందర్శకులు సముద్ర బీచ్‌ను చూస్తూ ఈ పార్కులోనే ఎక్కువ సమయం గడుపుతుంటారు. బీచ్‌కు, రోడ్డుకు మధ్యలో ఉన్న ఈ పార్కులో అధికారులు సందర్శకుల కోసం పచ్చని లేన్‌లు, పూల మొక్కలు, పాత్‌వేలు, మెట్లు, రెయిటింగ్, సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వాటిపై కూర్చొని సముద్ర అలలను తిలకించడానికి వీలుగా ఉంటుంది. పిల్లలు, వృద్ధుల్ల అదుపు తప్పి కిందకు జారిపోకుండా పాత్‌వేలను ఆనుకొని సముద్రం వైపు రెయిలింగ్ నిర్మించారు. ఇప్పుడు దాని జాడే కనిపించడం లేదు. పార్కు అంతా రెయిలింగ్ విరిగిపోయింది. పాత్‌వేలపై అమర్చిన పలకలు ధ్వంసమయ్యాయి. కొన్ని చోట్ల మెట్లు పూర్తిగా ఊడిపోయి ఖాళీలు ఏర్పడ్డాయి.

దట్టంగా పిచ్చి మొక్కలు..

పార్కులో సందర్శకులు కూర్చొన్న చోటే పిచ్చి మొక్కలు దట్టంగా మొలిశాయి. ఈ మొక్కల్లోనే సందర్శకులు తీసుకొచ్చిన తినుబండారాల ప్లాస్టిక్ కవర్లు, పేపర్ ప్లేట్లు తదితర వ్యర్థాలను వేస్తున్నారు. వీటి నుంచి దుర్వాసన వస్తోంది. దీంతో ఈ పార్కుకు వెళ్లే సందర్శకులు అసౌకర్యంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి పరిస్థితి నెలకొందని పర్యాటకులు నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి తెన్నేటి పార్కులోని పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేసి, శిథిలమైన మెట్లు, పాత్‌వేలు, సిమెంట్ బెంచీలను బాగు చేయించాలని సందర్శకులు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలు, విరిగిన రెయిలింగ్

కాలినడకన విధులకు మేయర్



కాలినడకన కార్యాలయానికి వస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. తన క్యాంపు కార్యాలయం నుంచి నడుచుకుంటూ ఆర్టీసీ బస్టాప్‌కు చేరారు. సిటీ బస్సు ద్వారా సాధారణ ప్రయాణికుల వలే డబ్బులిచ్చి టిక్కెట్ తీసుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రయాణించి, అక్కడి నుంచి కాలినడకన జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. చాలా మంది అధికారులు సొంత వాహనాల్లో కార్యాలయానికి వస్తున్నట్టుగా తెలిసిందని, సొంత, ప్రభుత్వ వాహనాలు విడనాడి ప్రైవేట్ వాహనాలపై రావాలని మేయర్ ఆదేశించారు.

ఆధునిక ఆర్బిటల్ అథెరెక్టమీతో గుండెకు చికిత్స



రోగితో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు

ఎంవీపీకాలనీ: బైపాస్ సర్జరీ చేయాల్సిన ఒక రోగి గుండె సమస్యను ఆధునిక సాంకేతికతతో కూడిన ఆర్బిటల్ అథెరెక్టమీ ద్వారా మెడికవర్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా నయం చేశారు. 62 ఏళ్ల ఓ రోగి రెండు వారాలుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండడంతో పాటు ఛాతీనొప్పి, అధిక రక్తపోటు, డయాబెటిస్ సమస్యలను ఎదుర్కొంటున్నాడు. ఈ సమస్యలతో ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రిలో చేరగా వైద్యులు పరీక్షించి కాడ్ నాన్ స్టెమీగా నిర్ధారించారు. అయితే ఈ సమస్యకు బైపాస్ సర్జరీ చేయాల్సి ఉండగా రోగికి అధిక వయసు రీత్యా వైద్యులు అధునాతన సాంకేతికతతో కూడి ఆర్బిటల్ అథెరెక్టమీ చికిత్స అందించారు. ఈ చికిత్స ద్వారా బైపాస్ సర్జరీతో పని లేకుండా గుండెకు స్టంటింగ్ విజయవంతంగా పూర్తిచేశారు. తద్వారా గుండెకు రక్త, ఆక్సిజన్ ప్రసరణలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించారు. ఈ సందర్భంగా డాక్టర్ బోడేపూడి శ్రీకాంత్ మాట్లాడుతూ బైపాస్ సర్జరీకి బదులుగా విశాఖలో తొలిసారి మెడికవర్ ఆస్పత్రిలో రోగికి ఆర్బిటల్ అథెరెక్టమీని విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. రోగి పూర్తి క్షేమంగా ఉన్నట్లు వెల్లడించారు. మెడికవర్‌లో అనుభవజ్ఞులైన డాక్టర్ల ద్వారా ఈ చికిత్స సజావుగా సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి హెడ్ డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరావును సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మద్దిలపాలెం: నూతనంగా ఎన్నికైన జిల్లా హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్(హెచ్‌డబ్ల్యూఏ) కార్యవర్గ సభ్యులు సోమవారం జిల్లా ఎన్‌జీవో అధ్యక్షుడు కె.ఈశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కొత్త కార్యవర్గాన్ని పరిచయం చేసుకున్నారు. అనంతరం ఈశ్వరరావుకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ అధ్యక్షుడు పి.మోహిని, జనరల్ సెక్రటరీ మంగ, కోశాధికారి ఎం.ఎస్.ఎస్.ఆనంద్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ.సత్యవతి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

12 నుంచి ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై శిక్షణ

మద్దిలపాలెం: వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి ఐదు రోజుల పాటు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫెవిక్రిల్ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం గురువాయూరప్పన్ ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల మహిళలు వర్క్‌షాప్‌లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 85200 04288 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం



ఎంవీపీ గ్రంథాలయంలో సరస్వతీదేవి చిత్రపటానికి నమస్కరిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభించారు. ముఖ్య అతిథి శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ షణ్ముఖ, రచయిత సుసర్ల సర్వేశ్వరశాస్త్రి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులంతా ముందుగా సరస్వతీదేవి చిత్రపటానికి నమస్కరించారు. అనంతరం షణ్ముక మాట్లాడుతూ గ్రంథాలయం దేవాలయంతో సమానమన్నారు. ఇక్కడ విజ్ఞానాన్ని విద్యార్థులు ఒడిసి పట్టాలని సూచించారు. మహాభారతంలోని కొన్ని ఘట్టాలను విద్యార్థులకు వివరించారు. సర్వేశ్వరశాస్త్రి మాట్లాడుతూ చదువుకునే దశలో బహుముఖ నైపుణ్యం అలవరచుకొనే దిశగా పిల్లలు శ్రమించాలని సూచించారు. 15 రోజుల పాటు సాగనున్న ఈ శిక్షణలో చిన్నారులకు కథలు, ఆంగ్లం, డ్రాయింగ్, క్రాఫ్ట్ వర్క్స్‌లో తర్ఫీదు ఇవ్వనున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ తొలేళ్ల సంబరం





ప్రత్యేక అలంకరణలో దుర్గమాంబ, అమ్మవారి ప్రతిమలతో భక్తులు

నేడు ప్రధాన జాతర

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం దుర్గానగర్ వాసుల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ అమ్మవారి తొలిప్రతిమకు పూజలు చేసి యాత్రను ప్రారంభించారు. సుమారు 65 అమ్మవారి ప్రతిమలను దొండపర్తి, జగదాంబ, అల్లిపురం, కాన్వెంట్‌కూడలి, జ్ఞానాపురం, రామ్మూర్తి పంతులపేట మీదుగా ఊరేగించి కంచరపాలెంలోని సీతారామాలయం, సంపత్ వేంకటేశ్వరాలయం, ధనలక్ష్మి ఆలయాల ఆవరణలో నిలిపారు. అనంతరం తోటవీధిలోని పుట్ట బంగారం వద్దకు చేర్చారు. తొలేళ్ల ఉత్సవంలో నేలవేషధారణలు ఆకట్టుకున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. మంగళవారం ప్రధాన జాతరనిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

‘స్పందన’కు 24 అర్జీలు



మహిళ నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 24 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ని శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రవికృష్ణ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంకీర్తన పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

సీతంపేట: అన్నమాచార్య సంకీర్తన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. అన్నమాచార్య 615వ జయంతిని పురస్కరించుకుని శృతిలయ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. సోమవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో బహుమతుల ప్రదానోత్సవాన్ని సింహాచలం దేవస్థానం పురోహితుడు కరి సీతారామాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య సంకీర్తనలతో వేంకటేశ్వర స్వామి వారి పరిపూర్ణ కటాక్షం లభిస్తుందన్నారు. ముఖ్య అతిథి ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే భక్తిని అలవర్చుకోవాలన్నారు. సంగీత కళలో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించే దిశగా అన్నమాచార్య జయంతిని నిర్వహించిన శృతిలయ సంస్థ ప్రతినిధులను అభినందించారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విజేతలు వీరే.. : సబ్ జూనియర్స్ విభాగంలో రితిక మహాదేవ్, ఇంద్ర మహిత్, ఆకాంక్షవల్లి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. జూనియర్స్ విభాగంలో హరిణి, నిరత్వయ, సాయి శ్రావణి.. సీనియర్స్ విభాగంలో పి.శారద, నాగలక్ష్మి, లక్ష్మీప్రియాంక మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వి.ప్రభాకర్, ఎం.ఎస్.మాధవ్, సిహెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు పాల్గొన్నారు.

దళిత అధికారులపై వేధింపులు తగవు



నినాదాలు చేస్తున్న భీమ్‌సేన ప్రధాన కార్యదర్శి రవిసిద్ధార్థ, ప్రతినిధులు

సీతంపేట: దళిత అధికారులపై జరుగుతున్న అట్రాసిటీలను తీవ్రంగా ఖండిస్తున్నామని భీమ్‌సేన ప్రధాన కార్యదర్శి రవి సిద్ధార్థ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతకాలంగా రాష్ట్రంలో దళిత అధికారులు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాయితీగా ఆత్మగౌరవంతో విధులు నిర్వహిస్తున్న అధికారులు దళితులైతే వారిపై అనేక అసత్య ఆరోపణలు చేస్తూ మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో డాక్టర్ అచ్చెన్న హత్య నుంచి జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన రాజాబాబు వరకు అనేక మంది అట్రాసిటీకి గురయ్యారని చెప్పారు. జీ20 సదస్సు విజయవంతంగా నిర్వహించి ప్రపంచ దేశాల ప్రతినిధులచే మన్ననలు పొందినప్పటికీ రాజాబాబుపై అసత్య ఆరోపణలు చేయడానికి ప్రధాన కారణం దళితుడు కావడమే అన్నారు. జీవీఎంసీలో సూపరెండెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న అధికారి దళితుడు అవ్వడం వల్ల ఆయనపై అసత్య ఆరోపణలతో దుష్ప్రచారం జరుగుతోందన్నారు. విశాఖ రైల్వే ఆస్పత్రిలో పనిచేస్తున్న దళిత డాక్టర్‌పై అక్కడున్న సహచర ఆధిపత్య కులాల డాక్టర్లు దాడులు చేశారని ఆరోపించారు. ఇటువంటి ఘటనలపై ప్రభుత్వాలు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో భీమ్‌సేన ప్రతినిధులు ఓంకార్, జగదీష్, శ్రీకాంత్, జైకుమార్, రావణ్, రాము, శ్రీను, సర్వేశ్వరరావు, అప్పలరాజు, ఉత్తరాంధ్రా దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ నేత మణికంఠపై కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: కర్ణాటక రాష్ట్ర బీజేపీ నేత మణికంఠ రాథోడ్‌పై కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ నాయకులు సోమవారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున కుటుంబ సభ్యులపై హత్యాయత్నానికి ప్రయత్నిస్తున్నారనే విధంగా మణికంఠ రాథోడ్ మాట్లాడిన ఆడియో వైరల్‌పై ఫిర్యాదు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. హత్యాయత్నానికి ప్రయత్నిస్తున్న బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పాలిసెట్ మోడల్ పరీక్షకు విశేష స్పందన

మురళీనగర్: రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు కంచపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో గత నెల 17 నుంచి నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత కోచింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు సోమవారం పాలిసెట్ మోడల్ పరీక్ష నిర్వహించారు. దీనికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. రెండు బ్యాచ్‌లకు చెందిన వారు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు పర్యవేక్షించారు.

జూలో మందు పార్టీలు!

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కొంత మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలో మద్యం తాగుతున్నట్లు బయటపడింది. జూ ఎస్‌ఎంఆర్‌లుగా పని చేస్తున్న కొంతమంది ఎన్‌క్లోజర్ల పక్కన మద్యం తాగుతున్నట్లు రెండు రోజుల క్రితం జూ అధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో ఆయా ఎస్‌ఎంఆర్‌లను అధికారులు నిలదీయడంతో జూ లోపలకు మద్యం బాటిళ్లు తీసుకొచ్చి తాగుతున్నట్టు అంగీకరించినట్టు విశ్వసనీయ సమాచారం. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

రైల్వే వైద్యులపై ఆరోపణలు అవాస్తవం

- రైల్వే సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి

తాటిచెట్లపాలెం: రైల్వే వైద్యులపై ఇటీవల వస్తున్న తప్పుడు ఆరోపణల్లో వాస్తవం లేదని ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే డివిజనల్ ఆస్పత్రి సీనియర్ వైద్యులపై బదిలీ అయిన వైద్యుడు తప్పుడు ఆరోపణలతో కేసులను పెట్టి తమ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇదే వ్యక్తిపై గతంలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జోనల్ రైల్వే పాలనా కేంద్రం వేరే డివిజన్‌కు బదిలీ చేసిందన్నారు. బదిలీ విషయం తెలుసుకున్న సదరు వైద్యుడు తొలుత అనారోగ్యంతో ఉన్నట్లు తప్పుడు సమాచారం అందించారని, ఉన్నతాధికారులు నిజాలు తెలుసుకుని నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. దీంతో అతను కటక్‌లోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ నుంచి తాత్కాలిక స్టే తెచ్చుకున్నట్టు తెలిసిందన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో పనిచేసి, సస్పెండైన ఓ ఉద్యోగి సాయంతో మీడియా ముందుకు వచ్చి ఎస్సీ, ఎస్టీలపై రైల్వే అధికారులు వేధింపులు చేస్తున్నారని చెప్పడం ఆక్షేపణీయమన్నారు. విధుల నుంచి వేటు పడిన వారు చేసే తప్పుడు ఆరోపణలపై చర్యలుంటాయన్నారు. అవినీతి, బ్లాక్‌మెయిల్, తప్పుడు ప్రవర్తనపై న్యాయపరమైన చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు.

బస్సు బ్రేకులు ఫెయిల్ కాలేదు

- డ్రైవర్ చాకచక్యం వల్ల ప్రమాదం తప్పింది
- సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్

సింహాచలం: ఆర్టీసీ బస్సుల్లో సింహగిరికి వెళ్లే వారికి సురక్షితమైన ప్రయాణం అందిస్తున్నామని సింహాచలం డిపో మేనేజర్ రాజశేఖర్ సోమవారం తెలిపారు. సింహాచలం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులు మాత్రమే సింహగిరికి పలు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటాయని చెప్పారు. ఆ బస్సులన్నింటీ ముందుగా పరిశీలించి ఫిట్ ఫర్ ఘాట్‌కు అనుకూలమైతేనే నడపడం జరుగుతుందని పేర్కొన్నారు. గడిచిన ఆదివారం సింహగిరికి వెళ్తున్న బస్సు బ్రేకులు ఫెయిల్ కాలేదని స్పష్టం చేశారు. టోల్‌గేట్ దాటిన తర్వాత వచ్చే ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఎగువకు ఎక్కుతున్న సమయంలో బస్సుకు కారు అడ్డుగా వచ్చిందన్నారు.ఈ లోగా బస్సుకు కారు మధ్యలోకి ద్విచక్ర వాహనదారుడు కూడా వచ్చేయడంతో డ్రైవర్ సమయ స్ఫూర్తితో కుడి వైపు తిప్పాడన్నారు. ఈ తరుణంలో బస్సు ఎదురు భాగం దెబ్బతిందన్నారు. ఆ తర్వాత చాకచక్యంగా వ్యవహరించి బస్సులో ఉన్న ప్రయాణికులకు ప్రమాదం జరగకుండా చూశాడన్నారు. వెనక్కి వెళ్లిన బస్సు రైలింగ్‌ను ఢీకొని నిలిచిందని తెలిపారు. ఈ సంఘటనలో బస్సు బ్రేకులు ఫెయిల్ కాలేదని తెలియజేశారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఏయూ విద్యార్థికి స్థానం



విద్యార్థి రాణాప్రతాప్‌ను అభినందిస్తున్న విభాగాధిపతి అప్పారావు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వకళా పరిషత్, తెలుగు విభాగం ఎంఏ తెలుగు ప్రథమ సంవత్సరం విద్యార్థి ఐ.రాణాప్రతాప్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సాహిత్య సంబరాల్లో భాగంగా శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని ‘అమ్మ నా మాతృ భాష’ అనే కవితను రాణాప్రతాప్ వినిపించారు. అతడికి జాతీయ సాహిత్య పురస్కారం, ప్రశంసా పత్రం, జ్ఞాపికతోపాటు కవి శ్రేష్ఠ బిరుదును ప్రదానం చేశారు. సోమవారం రాణాప్రతాప్‌ను తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అభినందించారు.

ఉమా చంద్రమౌళీశ్వరుడికి విశేష అభిషేకాలు



ఉమా చంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు విశేషంగా నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ అలంకరించారు. హరనామస్మరణలో భక్తులు మునిగితేలారు.